క్లుప్తంగా

ఒంగోలు మండలంలో భారీ వర్షం

ఒంగోలు రూరల్ : మండలంలో గురువారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. పలు లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. వర్షం, గాలి కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఇంటర్నెట్ సేవలు కూడా నిలిచిపోయాయి. ఈ వర్షంతో పొగనారు, వరినాట్లు వేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. మిరపతోటలు, జూట్ పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేకూరుస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి నగదు అందజేత

నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడు కూడలిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. గురువారం నాగులుప్పలపాడులో విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన.. నిర్వాహకులు విజయేంద్ర బహుజన్, గుంపుల సుబ్బారావు, కమిటీ సభ్యులకు నగదు అందజేశారు.

పేదలకు భోజనం అందజేత

కొత్తపట్నం : మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం పేదలు, భిక్షాటన చేసే వృద్ధులు, అనాథలు, అంధులు, వికలాంగులకు భోజనాలు పంపిణీ చేశారు. దాతలు డాక్టర్ దారా చెన్నకేశవ ప్రాణహిత గార్ల కుమారుడు విరజ్ కేశవ్ రెండో పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ డి.కేశవ, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాల పరిశీలన

ఒంగోలు సెంట్రల్: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా కార్యదర్శి తీగల సత్యవతి కోరారు. ఒంగోలులోని చంద్రయ్యనగర్‌లో పార్టీ నగర అధ్యక్షుడు మనోజ్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలో శక్తి కేంద్రాలు, బూత్ కమిటీలు ఓటర్ జాబితాల పరిశీలన, తదితర అంశాలపై నాయకులు అనుసరించిన విధివిధానాలపై చర్చించారు. తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఖలీఫాతుల్లాబాషా, రాష్ట్ర మహిళా నాయకురాలు మీనాకుమారి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి, కేసు నమోదు

ఒంగోలు టౌన్: వినాయకచవితి ఊరేగింపు సందర్భంగా జరిగిన గొడవల్లో ఉన్నాడనే అనుమానంతో ఒక యువకుడిపై దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గత శనివారం జరిగిన వినాయకుడి ఊరేగింపులో కొప్పోలు ఫ్లైఓవర్ వద్ద రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆ సమయంలో స్థానిక 60 అడుగుల రోడ్డుకు చెందిన బీటెక్ విద్యార్థి ఏ శివసాయి అక్కడే ఉన్నాడు. ఆ గొడవలో అతడు కూడా ఉన్నాడనే అనుమానంతో శ్రీగిరి కొండపై వాటర్ ట్యాంకు సమీపంలో నివశించే వెంకటేష్, రాంసాయి, పవన్, ఉపేంద్ర, ఇస్మాయిల్ కలిసి బుధవారం కోర్టు సెంటర్లో పానీ పూరి బండి వద్ద నిలబడి ఉన్న శివసాయిపై దాడి చేశారు. అంతటితో ఊరుకోకుండా కొండమీదకు తీసుకెళ్లి కర్రలతో చితకబాదారు. మళ్లీ ఎక్కడైనా కనిపిస్తే చంపేస్తామని బెదిరించి వెళ్లిపోయారు. అనంతరం బాధితుడు తన మామ గంగయ్యకు ఫోన్ చేయగా అతడు వచ్చి గాయాలతో ఉన్న శివసాయిని చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీ నరసింహుని ఆదాయం రూ. 4.62 లక్షలు

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ క్షేత్రధిపతి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో గురువారం దేవాదాయ శాఖ అధికారులు సమక్షంలో హుండీ లెక్కించారు. మొత్తం భక్తుల కానుకల ద్వారా లభించిన ఆదాయం రూ.4,62,891 వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు నర్రావుల ఏడుకొండలు, ఈవో కోటిరెడ్డి పర్యవేక్షించారు.

పేరిరెడ్డిని అభినందించిన ఎంపీ సురేష్

చినగంజాం: జిల్లా ప్రధానోపాధ్యాయుల విభాగంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పిడపర్తి పేరిరెడ్డిని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అభినందించారు. గురువారం ఎంపీ నందిగం సురేష్‌ను ఆయన స్వగృహంలో పిడపర్తి కలిశారు. విద్యారంగానికి ఆయన అందించిన అనేక కార్యక్రమాలతో పాటు, ఎన్‌సీసీ చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించడం అభినందనీయమన్నారు.

పేదలకు భోజనం అందజేత

కొత్తపట్నం : మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం పేదలు, భిక్షాటన చేసే వృద్ధులు, అనాథలు, అంధులు, వికలాంగులకు భోజనాలు పంపిణీ చేశారు. దాతలు డాక్టర్ దారా చెన్నకేశవ ప్రాణహిత గార్ల కుమారుడు విరజ్ కేశవ్ రెండో పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ డి.కేశవ, తదితరులు పాల్గొన్నారు.

జాషువా జీవితం ఆదర్శం



బాలికలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాటిబండ్ల సులోచన, శారద

- మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు మెట్రో: గుర్రం జాషువా జీవితం మనకు ఆదర్శనీయమని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. జాషువా 128వ జయంతి సందర్భంగా మాదిగ జనసేవా సమితి ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రకాశం భవనంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ భవనం వద్ద గల బాలికల వసతి గృహంలో బాలికలకు స్వీట్లు పంపిణీ చేశారు. జాషువా గొప్పతనం గురించి మేయర్ గంగాడ సుజాత విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అమ్మయ్య పంతులు, కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, బాలకోటయ్య, అంగలకుర్తి ప్రసాద్, రాఘవులు, సుబ్బారావు, పులి శ్రీనివాసు, కొండయ్య, మాదిగ జనసేవా సమితి నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో..

ఒంగోలు అర్బన్: ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 128వ జయంతి కార్యక్రమాన్ని ఎంఈఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా సభ్యులు జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. దీనిలో అధ్యక్షులు కత్తి ఐజక్, బొత యేసుదాసు, ఎంఎస్‌పీ అధ్యక్షుడు తోరేటి ఆనంద్, ఎంఆర్‌పీఎస్ తిరుపీధులు బాబు, రమేష్, పాలపర్తి సుందర్‌బాబు, పూనూరి నరసయ్య, రెబ్బవరపు మనోహర్, బాచి, ఆంజనేయులు, ప్రకాష్‌బాబు, శ్యాప్రసాద్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ భారతి సేవా సమితి ఆధ్వర్యంలో జాషువాకు నివాళులు...

చీమకుర్తి: వైఎస్సార్ భారతి సేవా సమితి అధ్యక్షురాలు పాటిబండ్ల సులోచన, మాజీ కౌన్సిలర్ పాటిబండ్ల శారద ఆధ్వర్యంలో గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గురువారం చీమకుర్తి క్రిస్టియన్ పాలెంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాషువా సాహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

సబ్జెక్టుపై పట్టు సాధిస్తే ఉద్యోగావకాశాలు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధిస్తే జీవితంలో విజయావకాశాలు మెండుగా ఉంటాయని స్థానిక పేస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి పేర్కొన్నారు. స్థానిక పేస్ కళాశాలలో ఇంజినీరింగ్ ట్రిపుల్-ఈ విద్యార్థులకు మ్యాట్ ల్యాబ్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు వీవీఐటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎలక్ట్రిక్ ఇంజినీరింగ్‌లో వివిధ ఎలక్ట్రిక్ నెట్‌వర్క్‌లను అనుసంధానం చేయడంలో మ్యాట్ ల్యాబ్ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎలక్ట్రికల్ వాహనాల తయారీలో మ్యాట్ ల్యాబ్ ఉపయోగిస్తారని చెప్పారు. అనంతరం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవీంద్రను సన్మానించారు. ట్రిపుల్ ఈ విభాగాధిపతి బి.నాగరాజు, కో కన్వీనర్ కేవీ నారాయణ, కో ఆర్డినేటర్లు కేవీ శివారెడ్డి, ఎం.మల్లికార్జునరావు, కె.జీవన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- అక్టోబర్ 1న ఒంగోలులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



హౌసింగ్ బోర్డులో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: పరిసరాల పరిశుభ్రతను అందరూ పాటించాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. నగరంలో గురువారం స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి కార్యక్రమానికి సంబంధించిన పాంప్లేట్లు పంచిపెట్టారు. బ్యానర్లు ప్రదర్శించి స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నగరంలో పారిశుధ్య కార్మికులు నిర్వహిస్తున్న మురుగు కాలువల పూడికతీత కార్యక్రమాన్ని కమిషనర్ పర్యవేక్షించారు. కాలువల నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయని, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని స్పష్టం చేశారు. ప్రజలంతా గుడ్డ సంచులు, గోనె సంచులు వాడాలని పిలుపునిచ్చారు. గురువారం ఆహార పదార్థాల వృథాపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టామన్నారు. నగరంలోని హోటళ్ల వద్ద మిగిలిపోయిన ఆహార పదార్థాలు సేకరించి అవసరమైన వారికి అందిస్తున్నామన్నారు.

పారిశుధ్య కార్మికులకు రేపు ఉచిత వైద్య పరీక్షలు...

నగరంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శనివారం ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. దాదాపు 1000 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తున్నామని, అందుకోసం ప్రత్యేకంగా వైద్యులను రప్పిస్తున్నామని చెప్పారు. ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా అందించి అనారోగ్యం పాలైన వారికి ప్రత్యేకంగా వైద్యం చేయించాలని కూడా నిర్ణయించామన్నారు. అదేవిధంగా అక్టోబర్ 1వ తేదీ నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆ రోజు శ్రమదానం ద్వారా రోడ్లు శుభ్రం చేయడం, కాలువలు శుభ్రం చేయడం, యాంటీ లార్వా కార్యక్రమం లాంటివి చేపడుతున్నామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు, శానిటేషన్ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, డీఈ గణపతి, డివిజన్ అధ్యక్షుడు రాజేష్ పాల్గొన్నారు.

నాగయ్యను పరామర్శించిన మంత్రి సురేష్



నాగయ్యను పరామర్శిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న మందా నాగయ్యను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం పరామర్శించారు. మండలంలోని అమానిగుడిపాడుకు చెందిన నాగయ్య అనారోగ్యంతో తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. ఆయన పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని ఖర్చుల కోసం కొంత మేరకు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు మంత్రి ధైర్యం చెప్పి ఓదార్చారు.

భవ్యశ్రీ హంతకులను శిక్షించాలి

మార్కాపురం రూరల్: వడ్డెర సామాజిక వర్గానికి చెందిన భవ్యశ్రీని దారుణంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మార్కాపురం మండలం రాయవరంలో గురువారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. వడ్డెర సంఘ సభ్యులు శానంగుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యువత, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ర్యాలీలో పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన

దొనకొండ: స్థానిక స్టేట్ బ్యాంక్ శాఖ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాన్ని కందుకూరు స్టేట్ బ్యాంక్ శాఖ రీజినల్ మేనేజర్ సూర్య ప్రకాష్ గురువారం పరిశీలించారు. త్వరలో ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. స్థానికులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. యం.కిరణ్, ఏ.ప్రభుదాసు, పరుచూరి రామలింగయ్య, పులిమి రమణాయాదవ్, అజయ్ ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

అర్థవీడు (కంభం): మండలంలోని పాపినేనిపల్లి 33/11కెవి సబ్ స్టేషన్‌లో ఉన్న 5 మెగావాట్స్ యాంపియర్‌ను 8 మెగా వాట్స్ యాంపియర్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో సబ్‌స్టేషన్ పరిధిలోని పాపినేనిపల్లి, బొల్లుపల్లి, అచ్చంపేట గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని ఏఈ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం నూతన యాంపియర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తేవని, నూతనంగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏతో ఇక నుంచే పగలే 9 గంటలు విద్యుత్ సరఫరా ఇచ్చే అవకాశం ఉందన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురవయ్య, అసిస్టెంట్ ఇంజినీర్ సాంబశివరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలందరికీ విఘ్నేశ్వరుని ఆశీసులు ఉండాలి



స్థానికులు, విగ్రహ కమిటీ సభ్యులతో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- అన్నదానానికి హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

మద్దిపాడు: జిల్లా ప్రజలందరికీ విఘ్నేశ్వరుని ఆశీసులు ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆకాంక్షించారు. గురువారం రాత్రి జంట గ్రామాలైన మద్దిపాడు మండలంలోని నేలటూరివారిపాలెం, సంతనూతలపాడు మండలంలోని గురవారెడ్డిపాలెం సెంటర్లో యువకులు ఏర్పాటు చేసిన గణపయ్య విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారి దయ జిల్లా ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమానికి హాజరయ్యారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పలువురు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదానంలో పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఒంగోలు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద వైద్య సిబ్బంది గురువారం పలు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ వాణి ఆధ్వర్యంలో గ్రామాల్లో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సీహెచ్‌ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఆ కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు, వారు తీసుకుంటున్న మందులు తదితర వివరాలు సేకరించారు. సుగర్, బీపీ వంటి పరీక్షలు నిర్వహించి వారికి ఏ తేదీన గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారనే దానిపై రసీదులు అందజేశారు. మరో ఏడు రోజుల పాటు సర్వే కొనసాగుతుందని వైద్యాధికారి వాణి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జయశ్రీ, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు ఘన నివాళి



స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

మార్కాపురం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని శ్రీవిద్య కోచింగ్ సెంటరులో భారత వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు పర్యావరణ కమిటీ కన్వీనర్ చక్కిలం శ్రీధర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి, గోధుమ తదితర పంటలపై ఆయన చేసిన కృషితోనే భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. జేవీవీ జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి.శరత్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఆకలి, పేదరిక నిర్మూలన కోసం ఎంఎస్ స్వామినాథన్ అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ ఇతర దేశాల్లోని మేలైన వరి రకాలను మనదేశంలో ప్రవేశపెట్టి వాటి నుంచి కొత్త వరి వంగడాలను ఉత్పత్తి చేశారన్నారు. కరువు అంచుల్లో ఉన్న భారత వ్యవసాయ రంగాన్ని స్వయం సమృద్ధివైపునకు తెచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకట్రావు, ఆర్.విప్లవకుమార్, వి.నందగోపాల్, రామసుబ్బారెడ్డి, అంజి, పి.భార్గవి, భవానీ, ప్రమీల, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాలకు శిద్దా విరాళాలు



విరాళాలు అందజేస్తున్న సుబ్బారావు

దర్శి: నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు గురువారం విరాళాలు అందజేశారు. యర్రోబనపల్లి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.2లక్షలు, నాయుడుపాలెం పోలేరమ్మ దేవాలయానికి లక్ష రూపాయలు, శామంతపూడి శివాలయానికి లక్ష రూపాయలు, కట్టశింగన్నపాలెం పోలేరమ్మ గుడికి రూ.50 వేలు, అబ్బాయిపాలెం రాములవారి గుడికి రూ.50 వేల రూపాయలు, చందలూరు శివాలయం గుడికి రూ.25వేల రూపాయలు విరాళంగా అందజేశారు. శిద్దారాఘవరావు ప్రతినిధి మందాది సుబ్బారావు ద్వారా దర్శిలో ఈ నగదు ఆయా దేవాలయాల నిర్వాహకులకు అందజేశారు. బొగ్గవరపు సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యలు పరిష్కారం చేశారు. నాయకులు, కార్యకర్తలతో సమస్యల గురించి చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం చేసినప్పుడే ప్రజా ప్రతినిధులకు గుర్తింపు వస్తుందన్నారు. ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని ఆర్థికంగా ఆదుకోవడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే మంచి సీఎంగా పేరు ప్రఖ్యాతులు, గుర్తింపు పొందారన్నారు. మద్దిశెట్టి శ్రీధర్, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షకీలా అమీన్ బాషా, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, నాయకులు సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు షేక్ సైదా, నాయకులు హరీష్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవతో రోగులకు మెరుగైన సేవలు



రోగులను పరీక్షిస్తున్న స్పెషలిస్ట్ వైద్యుడు

కంభం: ప్రభుత్వ వైద్యశాలల్లో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భవ కార్యక్రమంతో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివ నాయక్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం వైద్యశాలలో గైనకాలజిస్ట్, పీడియాట్రిక్, జనరల్ సర్జన్, ఆప్తమాలజిస్ట్, సైక్రియాటిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండి ఓపి చూస్తారని తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సర్జరీలకు సిఫారసు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

సీఎస్‌పురం (పామూరు): బాల్యవివాహాలు ఆరోగ్యానికి హానికరమని, చట్టరీత్యా నేరమని వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్.బజాజ్‌బుజ్జి అన్నారు. మండలంలోని శీలంవారిపల్లెలో గురువారం బాల్యవివాహాలవల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. వివాహ వయస్సు బాలికలకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్లు నిండాలన్నారు. నిర్దేశిత వయసు కన్నా వయస్సు తక్కువవారికి వివాహం చేస్తే అటు జైలు శిక్షతో పాటు, జరిమానా విధిస్తామన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు లేదా 1098 హెల్ప్‌లైన్ నంబర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రమాదేవి, సుగుణ, బాబూరావు, మునగల నారాయణరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రసన్న కాల భైరవ పూజలు

జరుగుమల్లి: మండలంలోని కె.బిట్రగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న కాల భైరవ దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఆంజనేయులు అభిషేకాల అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ ప్రసన్న కాల భైరవ స్వామికి అభిషేకం, గణపతి పూజ, హహాలక్ష్మి పూజ అనంతరం దేవాలయ ప్రాంగణంలో కాల భైరవ శాంతి హోమం వేద పండితులతో నిర్వహించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు పట్టణంలోని పీఆర్ కాలనీలోని వృద్ధాశ్రమం, ప్రభుత్వ వైద్యశాల, శిశు సంక్షేమశాఖ బాల సదన్‌లోని చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయబ్‌రసూల్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మానవ సేవ చేయాలనే మంచి ఉద్దేశంతో పేదలు, రోగులు, చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ముస్లిం నాయకులు షేక్ మస్తాన్‌వలి, ఖాజా, పెద్దవలి, లతీఫ్ ఖాన్, బాష, ముండ్లపాడు మాజీ సర్పంచి శేఖర్ పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అమూల్యం

వేటపాలెం: ముస్లింలు మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా గురువారం నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త సమస్త మానవాళికి అందించిన బోధనలు అమూల్యమైన వన్నారు. ఈపండగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఉరేగింపులు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ముస్లింలు సోదర భావం, ధర్మచింతన ఉండాలని బోధనలు తెలపుతాయన్నారు. మసీదుల్లో మహమ్మద్ ప్రవక్త చరిత్రపై ప్రసంగాన్ని ఇచ్చారు.

యువత సన్మార్గంలో నడుచుకోవాలి



మాట్లాడుతున్న పాస్టర్ ఏసుదాస్

మార్కాపురం టౌన్: యువత దేవుడు నిర్ణయించిన సన్మార్గంలో నడుచుకోవాలని తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్ సీహెచ్ ఏసుదాస్ సూచించారు. గురువారం స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లోని తెలుగు బాప్టిస్టు చర్చిలో యవ్వనస్తుల కూడిన ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యువత రోజు దేవుని వాక్యాన్ని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు జి.జయపాల్, సెక్రటరీ ఎస్.ప్రభుదాస్, డైరెక్టర్ డాక్టర్ లీనాగ్రేస్, తర్లుపాడు ఎంఈఓ సుజాత, కౌన్సిలర్ డి.హర్షిత, రాంప్రకాష్, లావణ్య, స్వరూప్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.